
సాక్షి
గుంటూరు
సోమవారం । 6 । నవంబర్ । 2023



మహంకాళీ అమ్మవారికి విరాళం

తాడేపల్లిరూరల్: కంతంరాజు కొండూరు లోని మహంకాళీ ఆలయ అభివృద్ధికి అమెరికాకు చెందిన కంతేటి శ్రీకాంత్ రూ.1,50,000 అందజేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 4,610 క్యూసెక్కులు విడుదల చేశారు.



పోటెత్తిన కార్తికేయుని ఆలయం

మోపిదేవి:వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

న్యూస్‌రీల్

ముగిసిన పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ గుంటూరు జిల్లాలో ఆదివారంతో ముగిసింది. ఉదయాన్నే పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,60,244 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.71.55 కోట్లు కేటాయించింది. ఆదివారం సాయంత్రానికి 2,57,794 మంది లబ్ధిదారులకు రూ.70.85 కోట్లు నగదు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. దేవినగర్‌కు చెందిన తమ్మిన వెంకట కిరణ్‌కుమార్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

దీపావళికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం దీపావళి పండగను పురస్కరించుకుని గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్–కటక్(07165) మధ్య ఈనెల 7, 14, 21 తేదీల్లో ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు తెలిపారు. కటక్–హైదరాబాద్(07166) మధ్య ఈనెల 8, 15, 22 తేదీల్లో ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రైలు హైదరాబాద్ సికింద్రాబాద్, పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు మీదుగా నడుస్తాయని తెలిపారు. ప్రయాణికులు గమనించి సురక్షితమైన ప్రయాణం చేయాలని కోరారు.

జిల్లా బాక్సింగ్ జట్టు ఎంపిక



గుంటూరువెస్ట్ (క్రీడలు): విశాఖపట్నంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ బాక్సింగ్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక బీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లా పోటీలను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్లా వెంకటేశ్వరరెడ్డి, కొసన వేణుగోపాల్ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన బాక్సర్లు పోటీల్లో పాల్గొన్నారు. కొసన వేణుగోపాల్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా మొత్తమ్మీద 30 మంది పాల్గొన్నారన్నారు. 11 మందిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఎంపికైన జట్టుకు వారం రోజులు శిక్షణనిస్తామన్నారు. రాజేశ్వరరావు, అన్నా వెంకటేశ్వరరావు, ఇమ్మానుయెల్ రాజు, శివారెడ్డి, ఫణి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప పాదయాత్ర ప్రారంభమై నేటికి ఆరేళ్లు

నేడు వైఎస్సార్ సీపీ జిల్లా, ప్రాంతీయ కార్యాలయాల్లో వేడుకలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి సోమవారానికి (ఈనెల 6 తేదీకి) ఆరేళ్లు పూర్తవుతుంది. రాష్ట్రంలోని పేదల జీవితాలు మెరుగుపడేందుకు విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టేందుకు ఈ యాత్ర తోడ్పడింది. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆధ్వర్యంలో గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా/ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేయనున్నారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించనున్నారు. వీరితోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొననున్నారు.

జీవన రాగాన పరవశం

శీతలగాలులకు లయబద్ధంగా

సప్తస్వరాలు జతకట్టబోతున్నట్టు.. గంధర్వులే దిగివచ్చి స్వరాభిషేకానికి గళం సవరించుకుంటున్నట్టు.. ఉరుకులపరుగుల జీవన తరం'గాన' వాయిద్యవిశేషమేదో గుండెను సుతారంగా మీటినట్టు.. సంగీత ఝరి రారమ్మంటూ సుస్వాగతం పలికినట్టు.. తెనాలి రాగాల పల్లకీలో విహరించేందుకు సిద్ధమవుతోంది. శ్రీసీతారామ గానసభ సంగీత సేవకు పునరంకితమవుతోంది.

సుస్వరాల స్వాగతం

- శ్రీసీతారామ గానసభ సంగీతోత్సవాలు పునఃప్రారంభం
- కర్ణాటక సంగీత ప్రచారంలో పునీతమైన సంస్థ
- దక్షిణభారతదేశంలోనే ఖ్యాతిగడించిన వైనం
- ఏడు దశాబ్దాలుగా నిరాటంకంగా సంగీత సేవ
- ఐదేళ్ల విరామం తర్వాత నేటి నుంచి సంగీతోత్సవాలు

తెనాలి: ఒకప్పుడు తెలుగునాట విరాజిల్లి తమిళనాడుకు వలస వెళ్లిన కర్ణాటక సంగీతానికి పునర్ వైభవం కల్పించేందుకు తెనాలి కేంద్రంగా ఏడు దశాబ్దాలు కృషిచేసిన 'శ్రీసీతారామ గానసభ' మళ్లీ సంగీత సేవకు పునరంకితమైంది. ఐదేళ్లుగా మూగనోము పట్టిన ఆ సంస్థ ఇప్పుడు మళ్లీ సంగీతోత్సవాల నిర్వహణకు సిద్ధమైంది. ఈనెల 6 నుంచి 10వ తేదీవరకు అట్టహాసంగా ఉత్సవాలు జరగనున్నాయి. మూడు దక్షిణాది రాష్ట్రాల నుంచి కళాకారులు తరలివచ్చి తమ గానామృతంతో తెనాలి సంగీతాభిమానులను పరవశింపజేయనున్నారు.



1972లో తెనాలిలో కుమార్తె రాధతో కలిసి ఎంఎస్ సుబ్బులక్ష్మి గానం

భక్తి సంగీత పోషణే ధ్యేయంగా..

దేశానికి స్వరాజ్యం సిద్ధించిన తొలిరోజుల్లో కర్ణాటక భక్తి సంగీత పోషణే ధ్యేయంగా శ్రీసీతారామ గానసభను తెనాలిలో ఆరంభించారు. న్యాయవాది, స్వాతంత్ర్యయోధుడు నారుమంచి సుబ్బారావు సారథ్యంలో 1947 ఆగస్టు 29న ఈ సంస్థ ఆవిర్భవించింది. ఉత్తమ శాస్త్రీయ సంగీత పోషణకే అంకితమైంది. ఆర్థిక వనరులు సమకూరటం, పేరున్న విద్వాంసులను ఆహ్వానించడం సవాల్‌గా మారినా దక్షిణ భారతదేశంలోని ఎందరో ఉద్దండులైన విద్వాంసులను తీసుకొచ్చి ఇక్కడ సంగీతోత్సవాలు దిగ్విజయంగా నిర్వహించింది. దీని వెనుక వ్యవస్థాపకుడి ఆశయం, కృషి ఉన్నాయి. తమిళనాడులోని సంగీత విద్వాంసులంతా గానసభ కచేరీల్లో పాలుపంచుకోవడం విశేషం.

మహారాజపురం విశ్వనాథ అయ్యర్, ముసిరి సుబ్రహ్మణ్యం అయ్యర్, చిత్తూర్ సుబ్రహ్మణ్యం పిళ్లై, ముదిగొండన్, సమ్మన్‌గుడి శ్రీనివాస అయ్యర్, టీఆర్ మహాలింగం, డీకే పట్టమ్మాళ్, పాల్ఘాట్ మణి అయ్యర్ తమ మధురమైన గాత్రంతో తెనాలి సంగీతాభిమానులను రసడోలికల్లో ఓలలాడించారు. 1960 వరకు కర్ణాటక సంగీత విద్వాంసులంతా చెన్నై తర్వాత తెనాలిలోనే ఎక్కువగా కచేరీలు చేశారంటే అతిశయోక్తి కాదు. భారతదేశంలో మరే ఇతర సంస్థకు ఇంతటి గౌరవం దక్కలేదు.

ఎంఎస్ సుబ్బులక్ష్మి తోడ్పాటు

'సంగీతం మోక్షం కోసమే.. జావళీ వగైరాలు పాడరాదు' అనే నియమాన్ని కచ్చితంగా అమలు చేసి, ఉన్నత విలువలతో నడిచినందునే గానసభకు అంతటి గౌరవం దక్కింది. గానసభ రజతోత్సవం సందర్భంగా అగ్రశ్రేణి గాయనీమణి ఎంఎస్ సుబ్బులక్ష్మి ఉచితంగా సంగీత కచేరీనిచ్చారు. సంస్థ ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు తోడ్పడ్డారు. సీతారామ గానసభలో పాడటం భగవంతుని సాన్నిధ్యంలో పాడటమంత ప్రత్యేక గౌరవంగా భావించారు ఆనాడు విద్వాంసులు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, హరినాగభూషణం, పిరాట్ల శంకరశాస్త్రి వంటి ప్రముఖులు ఇక్కడ కచేరీల్లో పాల్గొన్నారు. తెనాలిలోనే కాకుండా హైదరాబాద్, చెన్నై, తంజావూర్, తిరువారూర్, తిరువయ్యూర్, విజయవాడ, గుంటూరు, నరసరావుపేటల్లోనూ శ్రీసీతారామ గానసభ కచేరీలను నిర్వహించటం మరో విశేషం.

అనివార్య కారణాలతో ఐదేళ్లుగా..

శ్రీసీతారామ గానసభ ఏటా రామదాసు, శ్యామశాస్త్రి, త్యాగరాజ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తూ వచ్చింది. తిరువయ్యూరులో త్యాగరాజ వర్ధంతిని జరిపి సంగీత విద్వాంసులంతా ఆరోజు గానం చేయటం రివాజు. చాలాచోట్ల త్యాగరాజ వర్ధంతి వారోత్సవాలను నిర్వహించే ఆనవాయితీ ఉండగా, గానసభ ఆధ్వర్యంలో త్యాగరాజ జయంతి వారోత్సవాలను జరుపుతూ ప్రత్యేకతను నిలుపుకున్నారు. సంగీత విద్వాంసుల దృష్టిలో తెనాలి ఉత్తమ సంగీత పుణ్యక్షేత్రంగా విలసిల్లిందంటే అందుకు శ్రీసీతారామ గానసభ, ఆ సంస్థ వ్యవస్థాపకుడు నారుమంచి సుబ్బారావు అకుంఠిత దీక్ష, చిత్తశుద్ధి కారణం. నారుమంచి లేకున్నా, ఆర్థిక వనరుల కొరత ఉన్నా 2017 వరకు సంగీత సేవలో గానసభ పునీతమవుతూ వచ్చింది. అనివార్య కారణాలతో ఆ తర్వాత గానసభ కార్యకలాపాలు నిలిచిపోయాయి. నూతన కార్యవర్గంతో మళ్లీ ఇప్పుడు పునఃప్రారంభమయ్యాయి.

స్వరాజ్యం సిద్ధించిన రోజునే సంగీత సేవాదీక్ష



నారుమంచి సుబ్బారావు (ఫైల్)

తెనాలి సమీపంలోని చుండూరులో 1902 జూలై 30న జన్మించారు నారుమంచి సుబ్బారావు. తండ్రి సీతారామయ్య సంగీత విద్వాంసుడు. సుబ్బారావు చినతాత నారుమంచి జానకిరామయ్య సాక్షాత్తూ త్యాగరాజస్వామి దగ్గర శిష్యరికం చేసి పదినెలలు సంగీతం నేర్చారు. తెనాలి, గుంటూరు, చెన్నైలో చదివిన సుబ్బారావు కాలేజి రోజుల్లో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. ఏసీ కాలేజీలో షేక్‌స్పియర్, మిల్టన్, వర్డ్స్‌వర్త్ వంటి మహాకవుల రచనలను ఉటంకిస్తూ ఆయన చేసే ప్రసంగాలకు కాలేజి తరగతుల నుంచి బహిష్కరించారు. బందరు నోబెల్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. చెన్నై వెళ్లి లా చేశారు. తెనాలిలో న్యాయవాద వృత్తిని ఆరంభించారు. స్వరాజ్య పోరాటంలో పాల్గొన్నందుకు అరెస్టయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం రావటంతో సుబ్బారావు కల నెరవేరింది. అదే రోజున కర్ణాటక భక్తి సంగీత సేవాదీక్షను స్వీకరించారు. ఫలితంగానే శ్రీసీతారామ గానసభ ఆవిర్భవించింది. దక్షిణ భారతదేశంలోనే పేరెన్నికగన్న సంగీత సంస్థగా గుర్తింపు పొందింది.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

- రెయిలింగ్‌ను ఢీకొని కాలువవైపు ఒరిగిన ఆర్టీసీ బస్సు
- 12 మంది ప్రయాణికులు సురక్షితం
- మాచర్ల డిపో బస్సును తప్పించే క్రమంలో ప్రమాదం
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



సత్తెనపల్లి మేజర్ కాలువలోకి ఒరిగి ఇనుచువ్వలపై నిలిచిన ఆర్టీసీ బస్సు

సత్తెనపల్లి: ఆర్టీసీ ప్రయాణికులకు త్రుటిలో పెను ప్రమాదం తప్పిన ఘటన సత్తెనపల్లిలోని గుంటూరు రోడ్డు అమరావతి మేజర్ కాలువ వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. పిడుగురాళ్ల ఆర్టీసీ డిపోకు చెందిన బస్ పిడుగురాళ్ల నుంచి గుంటూరు వెళ్తుండగా అమరావతి మేజర్ కాలువపై ఉన్న చప్టా వద్దకు రాగానే ఎదురుగా గుంటూరు నుంచి వస్తున్న మాచర్ల డిపో బస్సును తప్పించబోయి పక్కనున్న రెయిలింగ్‌ను ఢీకొట్టింది. బస్సు కాలువలోకి ఒరిగింది. డ్రైవర్ నాయక్ రెయిలింగ్ ఇనుప చువ్వలను ఆసరాగా చేసుకుని బస్సును చాకచక్యంగా నిలపడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో కండక్టర్‌తోపాటు 12 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులు ప్రాణభయంతో బెంబేలెత్తారు. వీరిని సురక్షితంగా కిందకు దించడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రమాదంతో కిలోమీటర్ పొడవునా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి టౌన్ సీఐ పి.ప్రభాకర్ నేతృత్వంలో పట్టణ ఎస్‌ఐ రఘుపతిరావు, పోలీస్ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కాలువలోకి ఒరిగిన బస్సును సురక్షితంగా బయటకు తీసే యత్నాలు చేపట్టారు.

● నృత్యాంజలి



బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం నటరాజ సంగీత నృత్య కళాశాల 18వ వార్షికోత్సవం నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు జయము జయము, ముద్దుగారే యశోద, శరణం భవ, శివతాండవ స్తోత్రం తదితర అంశాలకు లయబద్ధంగా నర్తించి నటరాజుకు అంజలి ఘటించారు. ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను అలరించాయి. ముఖ్య అతిథులుగా ఆలయ అధ్యక్షుడు సీ.హెచ్.మస్తానయ్య, భూసురపల్లి వెంకటేశ్వర్లు, ఈరంటి వరప్రసాద్, ఎం.పద్మశ్రీ, కంచర్ల పద్మావతి, కాజా వేంకట సుబ్రహ్మణ్యం పాల్గొని విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. నాట్యాచారిణి అనంతుల విజయకుమారిని అభినందించారు. కార్యక్రమాన్ని అనంతుల ప్రణయనాథ్‌రెడ్డి, విజయకుమారి పర్యవేక్షించారు. - పాత గుంటూరు

ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్

- ఏపీ ఈఏపీ సెట్–2023 ఎంపీసీ, బైపీసీ స్ట్రీమ్‌లో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్
- ఎల్లుండితో ముగియనున్న ప్రక్రియ
- అదేరోజు సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం
- ఎంపీసీ, బైపీసీలకు వేర్వేరుగా వెబ్ ఆప్షన్ల నమోదు షెడ్యూల్
- 14, 17 తేదీల్లో సీట్ల కేటాయింపు



గుంటూరులోని ఓ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీఈఏపీసెట్–2023 ద్వారా ఫార్మసీ, బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెల 17న ప్రభుత్వం సీట్ల కేటాయింపు జరపనుంది. ఏపీ ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ స్ట్రీమ్‌ల వారీగా కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం విద్యార్థులందరూ ఫార్మసీ, బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. వివిధ ఫార్మసీ కళాశాలల్లో విద్యార్థుల కోసం ఉచిత రిజిస్ట్రేషన్ కేంద్రాలు నడుస్తున్నాయి.

8 నుంచి ఎంపీసీ స్ట్రీమ్‌లో సర్టిఫికెట్ల పరిశీలన

ఎంపీసీ స్ట్రీమ్‌లో బీ ఫార్మసీ, ఫార్మాడీ కోర్సులకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులకు ఈనెల 8, 9వ తేదీల్లో ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన జరగనుంది. రిజిస్ట్రేషన్ సమయంలో విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను ఎంపిక చేసిన కళాశాలల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లో పరిశీలించనున్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో అన్నీ సక్రమంగా ఉంటే, విద్యార్థులు వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలల ఎంపికకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. సర్టిఫికెట్ల పరిశీలన అసంపూర్తిగా ఉన్న పక్షంలో సంబంధిత ధ్రువపత్రాలను తీసుకుని, ఆన్‌లైన్‌లో ఉన్న హెల్ప్‌లైన్ కేంద్రాల జాబితాలో నుంచి ఎంపిక చేసుకుని, అదే హెల్ప్‌లైన్ కేంద్రంలో సర్టిఫికెట్లతో భౌతికంగా హాజరు కావాలి.

ఈనెల 9, 10, 11 తేదీల్లో ఎంపీసీ స్ట్రీమ్ పరిశీలన

బైపీసీ స్ట్రీమ్‌లో బీఈ, బీటెక్‌లలో బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్, బీ.ఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను ఈనెల 9,10,11 తేదీల్లో పరిశీలిస్తారు.

వెబ్ ఆప్షన్ల నమోదు

ఎంపీసీ స్ట్రీమ్‌లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఈనెల 10,11,12వ తేదీల్లో ఆన్‌లైన్‌లో కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. అదే విధంగా బైపీసీ స్ట్రీమ్‌లో ఈనెల 11,12,13వ తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. ఎంపీసీ స్ట్రీమ్‌లో ఈనెల 14న బైపీసీ స్ట్రీమ్‌లో ఈనెల 17న సీట్ల కేటాయింపు జరగనుంది.

క్రీడాసాధన జీవితంలో భాగం కావాలి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడా సాధన ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఉడెన్ షటిల్ కోర్టును కలెక్టర్, శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడా సాధనకు వయస్సుతో సంబంధం లేదన్నారు. నిత్యం ఏదో ఒక క్రీడలో సాధన చేయాలని చెప్పారు. ప్రస్తుత ఒత్తిడి సమాజంలో ఉపాధి ఒక్కటే సరిపోదని, రోగాలబారిన పడకుండా ఉండాలంటే క్రీడాసాధన తప్పనిసరన్నారు. ముఖ్యంగా ఉద్యోగులు ఒత్తిడిని జయించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆటల వల్ల క్రీడాస్ఫూర్తితోపాటు పోటీతత్వం పెరుగుతుందని కలెక్టర్ వివరించారు.

క్రమశిక్షణకు మారు పేరు ఆఫీసర్స్ క్లబ్: విప్ అప్పిరెడ్డి

ఐదు దశాబ్దాల నుంచి అంచెలంచెలుగా ఎదుగుతున్న ఆఫీసర్స్ క్లబ్‌లో ప్రతి ఒక్కరూ ఎంతో క్రమశిక్షణతో ఉంటారని శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా గత దశాబ్దకాలంలో కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేసి క్లబ్‌ను అభివృద్ధి చేశారన్నారు. ఇటువంటి క్రీడా క్లబ్‌లు మరిన్ని అందుబాటులోకి రావాలన్నారు. అనంతరం కలెక్టర్‌తో అప్పిరెడ్డి షటిల్ ఆడారు. ఇటీవల జాతీయ నేషనల్ గేమ్స్ జావెలిన్ త్రోలో కాంస్య పతకం సాధించిన కె.రష్మిని కలెక్టర్, అప్పిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి విల్సన్ బాబు, రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.శామ్యూల్ జొనాథన్, పీటీఓ డీజీపీ కార్యాలయ ఎస్పీ పి.శివారెడ్డి, ఏపీసీఎఫ్ఎస్ఎస్ సీఈఓ బి.సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

అర్హులందరికీ ఓటు హక్కు

మనదేశంలో ఓటు ఎంతో విలువైనదని, దీనిని అర్హతగల ప్రతి ఒక్కరూ పొందే హక్కుందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్పెషల్ క్యాంపైన్ డేలో భాగంగా జిల్లా వ్యాప్తంగా శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆదివారం కలెక్టర్ స్థానిక టీజేపీఎస్, మహిళా పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలు తమ ఓటు ఉందో లేదో చూసుకోవాలన్నారు. దీని కోసం అనేక మంది ప్రభుత్వ సిబ్బంది నిరంతరం పనిచేస్తున్నారన్నారు. ఓటు హక్కు లేకపోతే సమీప అధికారులను సంప్రదించాలన్నారు. బీఎల్వోలు క్లెయిమ్స్, అభ్యంతరాలను జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. తీసుకున్న ప్రతి అర్జీనీ పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పశ్చిమ మండల తహసీల్దార్ సాంబశివరావు, ఏఈఆర్వోలు సీహెచ్ శ్రీనివాస్, ఇ.కోటయ్య పాల్గొన్నారు.

కార్తీకమాస సందర్శకులకు ప్రత్యేక సౌకర్యాలు



విశేషాలంకారంలో అమరేశ్వరుడు

అమరావతి: పవిత్ర కార్తీకమాసంలో అమరావతిని సందర్శించే భక్తుల కోసం ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథశర్మ తెలిపారు. ఆదివారం ఆయన కార్తీకమాస ఏర్పాట్ల గురించి వివరించారు. నవంబర్ 14వ తేదీ నుంచి డిసెంబర్ 12 వరకు కార్తీకమాసంలో అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకునే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను ఒకేరోజు సందర్శించేందుకు భక్తులు ఏర్పాట్లు చేసుకుంటారు కాబట్టి శీఘ్ర దర్శనం కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆది, సోమవారాలలో భక్తుల తాకిడి దృష్ట్యా అందరికీ స్వామి దర్శనం, ప్రసాదం అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం సోమవారం రాత్రి పది గంటల వరకు ఆలయాన్ని తెరిచి ఉంచుతామని వివరించారు. మిగిలిన రోజులలో 9 గంటల వరకు ఆలయం తెరిచి ఉంచుతామని పేర్కొన్నారు. భక్తుల పరోక్షంలో కార్తీకమాస నిత్యాభిషేక పథకం ద్వారా అమరేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహిస్తామన్నారు. ప్రతి సోమవారం అమరేశ్వర స్వామికి వేకువజామున మూడుగంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అభిషేకాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం బాలచాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, కార్తీక పౌర్ణమికి కృష్ణానదిలో స్వామి తెప్పోత్సవం, అనంతరం జ్వాలామాలిక దీపోత్సవం నిర్వహిస్తామని వివరించారు. భక్తులకు ఉచిత దర్శనంతోపాటు ఉచితప్రసాదం అన్నదానం అందించనున్నట్టు చెప్పారు. స్నానఘట్టాలలో తాత్కాలిక మరుగుదొడ్లు, స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయనున్నట్టు ఈఓ వెల్లడించారు. ఆలయంలో సీసీ కెమెరాలను అమర్చి భక్తుల క్యూలైన్ల కదలికలపై నిరంతరం నిఘా పెడుతున్నట్టు వివరించారు. స్నానఘాట్‌లలో ప్రత్యేకంగా షవర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కృష్ణానదిలో భక్తులు లోతుకు వెళ్లకుండా పడవలపై నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముందు జాగ్రత్తగా గజఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామన్నారు.

గ్రామీణులకు బజరంగ్ నేత్రజ్యోతి బాసట



నేత్ర పరీక్షలకు వచ్చిన గ్రామస్తులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

- సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- కసుమర్రులో 656 మందికి నేత్ర వైద్య పరీక్షలు

కొరిటెపాడు(గుంటూరు): ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రదాతగా నిలిచారని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. పొన్నూరు మండలం కసుమర్రు గ్రామంలో ఆదివారం బజరంగ్ నేత్రజ్యోతి కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి మురళీకృష్ణ ప్రారంభించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ కంటి చూపును పాక్షికంగా కోల్పోయిన వారికి పూర్తిగా చూపు నశించకుండా రక్షణ కల్పిస్తూ, తిరిగి వెలుగును ప్రసాదించే బృహత్తర కార్యక్రమాన్ని బజరంగ్ ఫౌండేషన్ నేత్ర జ్యోతి చేపట్టిందన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమం వెనుక అంతర్లీనంగా సీఎం జగనన్న స్ఫూర్తి నిండిఉందన్నారు. బజరంగ్ సామాజిక సేవా విభాగం బృందం సభ్యులు గత రెండు రోజులుగా కసుమర్రు, పెద్దిఇటికంపాడు, వల్లభరావుపాలెం గ్రామాలలో ఇంటింటికి కరపత్రాలతో వెళ్లి గ్రామస్తులను శిబిరానికి సాదరంగా ఆహ్వానించారు. ఈ శిబిరంలో 656 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే ట్రికాన్ క్లినిక్స్ గుంటూరు వారి సహకారంతో గ్రామంలోని 57 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించడం జరిగింది. ప్రముఖ నేత్ర వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో చాంద్ బాషా

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్యకళాశాల ప్రాంగణంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో ఆదివారం మహిళా విభాగం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంకుమార్ ఎన్నికల అధికారిగా, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.నాగసాయి, మహిళా విభాగం చైర్‌పర్సన్ సుగుణ వ్యవహరించారు. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా ఎల్.పద్మావతి, కార్యదర్శిగా యు.సుమిత్రాదేవి, సహాధ్యక్షురాలిగా పారాబత్తిని హేమలత, జిల్లా కోశాధికారిగా శేషుకుమారి, కార్యనిర్వాహక సెక్రటరీగా రమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన మహిళా విభాగం నేతలను సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా, నాగసాయి, సుగుణ తదితరులు అభినందించి సన్మానించారు. నూతనంగా ఎన్నికైన పద్మావతి మాట్లాడుతూ మహిళా విభాగం సమస్యల కోసం, మహిళల హక్కులు కాపాడటమే బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కరీముల్లా, నగర శాఖ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, కార్యదర్శి సాంబశివారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అణచివేతకు గురైన మహిళల చరిత్రలే 'మిణుగురులు'

పరిచయ సభలో రచయిత్రి డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి



పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ రవికుమార్, పక్కన డాక్టర్ స్వరూపరాణి

తెనాలి: సమాజంలో అణచివేయబడిన వర్గాల్లో ఇంకా అణచివేతకు గురైన మహిళలు, ఆయా కాలాల్లో అద్భుత మహిళగా కీర్తిని గడించి చరిత్రల్లో తమ స్థానాన్ని సుస్థిరపరచుకున్న వారి స్ఫూర్తిదాయకమైన జీవితాల సంకలనమే 'మిణుగురులు' అని ప్రముఖ రచయిత్రి డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. డాక్టర్ స్వరూపరాణి రచించిన మిణుగురులు–చారిత్రాత్మక రచన ఆవిష్కరణ, పరిచయ సభ ఆదివారం సాయంత్రం మండల కేంద్రమైన కొల్లిపరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో నిర్వహించారు. బహుజన రచయితల వేదిక డాక్టర్ నూకతోటి రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రచయిత్రి డాక్టర్ స్వరూపరాణి మాట్లాడుతూ, దళితులుగా అణచివేయబడిన 26 మంది దళిత, గిరిజన, ఆదివాసి మహిళల చరిత్రను సేకరించి ఇందులో పొందుపరిచినట్లు తెలిపారు. బహుజనులు, శ్రామికవర్గాల ప్రతినిధులైన కత్తి చల్లమ్మ దగ్గర్నుండి జయభాగ్యమ్మ వరకు అద్భుత జీవిత చరిత్రలను తెలుసుకునేందుకు ఈ పుస్తకం ఉపకరిస్తుందని డాక్టర్ నూకతోటి రవికుమార్ చెప్పారు. ఆయా కథనాలు స్ఫూర్తినిస్తాయని చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుంచి డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్, డాక్టర్ పిల్లి వాసు, వేముల రోహిత్ మాతృమూర్తి వేముల రాధిక, భారత్ బచావో కార్యదర్శి వేము సమత, ఎస్‌కే చర్ల, బెన్‌హర్, ఏసు రత్నం మాట్లాడారు.

జిల్లాలో ఏడు మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఏడు మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా ఫిరంగిపురం మండలంలో 31.6 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 1.4 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... ప్రత్తిపాడు 26.2, తాడికొండ 19.4, మేడికొండూరు 14.2, చేబ్రోలు 2, దుగ్గిరాల మండలంలో 1.8 మి.మీ చొప్పున వర్షం పడింది.

భవిత రిసోర్స్ పర్సన్ పోస్టుల ఎంపిక జాబితా విడుదల

గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని భవిత కేంద్రాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు ఉద్దేశించిన రిసోర్స్ పర్సన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల చేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమగ్రశిక్ష గుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌లో ఉంచిన జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు సోమవారం ఉదయం 10.30 గంటలకు గుంటూరు బ్రాడీపేట 2/13లోని శారదానికేతన్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని సమగ్రశిక్ష జిల్లా రిసోర్స్ సెంటర్‌కు రావాలని సూచించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు.

క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలి

సత్తెనపల్లి: విద్యార్థులు ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా తరగతులకు హాజరై బోధకులు చెప్పిన పాఠ్యాంశాల్ని ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర పరిశీలకులు షేక్ అక్బర్ అలీ సూచించారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2023– 24 విద్యా సంవత్సరానికి గాను టెన్త్, ఇంటర్ ప్రవేశాలు పొందిన విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారు. సత్తెనపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన తరగతుల్ని అక్బర్ అలీ పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలు, జ్ఞానధార ప్రోగ్రామ్స్, ఆన్‌లైన్ వీడియోలు ద్వారా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తరగతుల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఏడీ డీసీ కేఎంఏ.హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాకారుడు వెంకట్రావుకు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకట్రావు

సత్తెనపల్లి: వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన ఓ కార్యక్రమంలో సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన కళాకారుడు మునగోటి వెంకట్రావు జాతీయ బంగారు నంది అవార్డుతో పాటు ఘనంగా సన్మానం అందుకున్నారు. సంగీతం, సమాజ సేవలో తాను చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డును అందుకున్నట్లు ఆయన ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వల్లూరి ఫౌండేషన్ ప్రెసిడెంట్ వి.ఆర్ శ్రీనివాసరాజు, సంస్థ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కార్తిక పౌర్ణమి నాడు పోతురాజుకు పడిగెం

- పల్నాటి వీరారాధన ఉత్సవాలకు సన్నాహాల ప్రారంభం
- పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ



చెన్నకేశవ

కారెంపూడి: ఈ ఏడాది పల్నాటి వీరారాధన ఉత్సవాల నిర్వహణలో భాగంగా ఈ నెల 26వ తేదీ రాత్రి కార్తిక పౌర్ణమి నాడు పోతురాజుకు పడిగెం కట్టనున్నట్లు పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. పల్నాటి రణక్షేత్రంలోని పల్నాటి వీరుల గుడిలో పోతురాజు శిలకు పడిగెం కట్టడం ద్వారా ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. చెన్నకేశవస్వామి సన్నిధిలో ఉన్న బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహ కుంతాన్ని వెలుపలికి తీసి పూజాదికాలు నిర్వహిస్తామని తెలిపారు. వీర్ల అంకాలమ్మ తల్లి ముఖద్వార జ్వాలా తోరణం మీదుగా ప్రవేశం చేసి అంకాలమ్మను దర్శించుకున్న అనంతరం అర్ధరాత్రి వీరుల గుడికి చేరుకుంటుందని చెప్పారు. పోతురాజు శిలకు పడిగెం అంటే 101 నూలు పోగులతో ఆనకట్ట కట్టి, ఉత్సవాలు పూర్తయ్యే వరకు ప్రాంగణానికి రక్షణగా ఉండాలని పోతురాజుకు బ్రహ్మనాయుడు ఆన పెట్టినట్లుగా కార్య క్రమం నిర్వహిస్తామని వివరించారు. అనంతరం వీరుల గుడిలో పల్నాటి వీరు ల ఆయుధాల చెంత పల్నాటి వీరాచార పీఠం ముందు అఖండ జ్యోతి వెలిగిస్తా మని చెప్పారు. పడిగెం కట్టిన దగ్గర నుంచి పల్నాటి వీరారాధనకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

వీరాచారవంతులకు వర్తమానాలు

రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో ఉన్న పల్నాటి వీరాచారవంతులు, వీర విద్యావంతులకు వర్తమానాలు పంపుతామని, వంశపారంపర్యంగా వస్తున్న పల్నాటి వీరాచారాన్ని నెరవేర్చుకునేందుకు తరలిరావాలని అందరికీ పేరు పేరునా లేఖలు రాస్తామని పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ వెల్లడించారు. పల్నాటి యుద్ధం క్రీ.శ 1182లో ముగిసిన దగ్గర నుంచి, వీర మరణం పొందిన వీరుల్ని ఆనాటి నుంచి క్రమం తప్పక ప్రతి ఏటా బ్రహ్మనాయుడు ఆదేశాల ప్రకారం స్మరించుకుంటూ వారి ఆయుధాలు (దైవాలు)లకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని వివరించారు. పల్నాటి యుద్ధంలో వీరులు వీర మరణం పొందిన నాగులేరు వాగు పరివాహ ప్రాంతంలోని నాగులేరు గంగధారి మడుగు వద్ద, వీరుల గుడిలో వివిధ రకాల క్రతువులు నిర్వహించి, యుద్ధంలో మృతి చెందిన వీరులకు నివాళులర్పించనున్నట్లు తెలిపారు. వీరుల శౌర్య పరాక్రమాల్ని వీర విద్యావంతుల కథాగానాల ద్వారా వివరిస్తారని, దీని ద్వారా వీరాచారవంతులు తమ పూర్వీకుల్ని స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోందని వివరించారు. వీరుల స్మరణలో భాగంగా వీరావేశంతో కత్తి సేవలు చేసుకుంటారని, వీర్ల అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామికి పూజలు చేస్తామని పేర్కొన్నారు. ఈ సంప్రదాయం కులాలకతీతంగా దాదాపు 840 ఏళ్లుగా కొనసాగుతూ వస్తోందని తెలియజేశారు. పల్నాటి వీరులలో సకల కులాలవారున్నారన్నారు. కుల మతాల కతీతంగా పల్నాటి రణక్షేత్రమైన కారెంపూడిలో మరోసారి అరుదైన వీరారాధనకు వేదిక కాబోతోందని తెలిపారు.

సముద్రతీరంలో గుర్తుతెలియని మృతదేహం

చీరాల: రామాపురం సముద్రతీరం వద్ద ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం సముద్రం నుంచి తీరానికి కొట్టుకువచ్చింది. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం రూరల్ ఎస్‌ఐ జనార్ధన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 35–40 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతుడికి సంబంధించినఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సామాజిక సాధికార యాత్ర జయప్రదం

- వెల్లువలా తరలివచ్చిన ప్రజలు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా, పక్కన నూరిఫాతిమా

నగరంపాలెం: ఈనెల 4న గుంటూరు తూర్పు నియోజకవర్గంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైందని, సభకు వెల్లువలా తరలివచ్చిన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు అగ్రవర్ణాల్లోని పేదలకు సైతం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాల దుష్ప్రచారాలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీ పక్షాన ఉన్నారని, రానున్న ఎన్నికల్లో విజయం తథ్యమని చెప్పారు. గత టీడీపీ హయాంలో అభివృద్ధి ఆమడ దూరంలో ఉండేదని, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ హయాంలో నియోజకవర్గంలో 80 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయన్నారు. ఇంకా పెండింగ్ సమస్యలను పూర్తి చేసే దిశగా అడుగులేస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో నూరిఫాతిమాను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ తమ కుటుంబంపై అత్యంత ప్రేమ, అభిమానం ఉందనేది మరోసారి సామాజిక సాధికార బస్సు యాత్ర ద్వారా నిరూపించిన నియోజకవర్గ ప్రజలకు పాదాభివందనమని అన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తమ గడప తలుపులు 24 గంటలు తెరిచే ఉంటాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ సీనియర్, ముఖ్య నాయకులు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడిన యువకుడు

- ఒక కిలోమీటరు ట్రాక్‌పై నడిచి మోసుకు వచ్చి, వాహనంలో చేర్చిన 108 సిబ్బంది
- ప్రథమ చికిత్స అనంతరం ఆస్పత్రికి తరలింపు



రైలు నుంచి జారిపడిన యువకుడిని తీసుకువస్తున్న 108 సిబ్బంది, స్థానికులు

తాడేపల్లిరూరల్: చెన్నై–కోల్‌కత్తా రూట్‌లో తెనాలి అంగలకుదురు మధ్య ఆదివారం తెల్లవారుజామున ఓ యువకుడు రైలులోనుంచి జారి కిందపడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికంగా ఉన్న రైతుల ద్వారా సమాచారం అందుకున్న దుగ్గిరాల 108 సిబ్బంది గుంటూరు–అంగలకుదురు రోడ్డుకు వెళ్లి అక్కడి నుంచి ట్రాక్‌పై ఒక కిలోమీటరు దూరంలో వున్న రైలు నుంచి జారిపడిన ఆ యువకుడ్ని మోసుకుంటూ 108 వాహనం వద్దకు తీసుకువచ్చి ప్రథమ చికిత్స నిర్వహించి తెనాలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆ యువకుడిది కాకినాడ అని అతడికి పుట్టుకతోనే చెవిటి, మూగగా 108 సిబ్బంది గుర్తించారు. అతని పేరు ప్రగడ శివరామకృష్ణ అని, అక్క బావతో కలసి వేరే ఊరు వెళుతున్నట్లు 108 సిబ్బంది రైల్వే పోలీసుల ద్వారా సమాచారం అందుకుని, అతని అక్కకు సమాచారం అందించారు. రాత్రి వారు కూర్చున్న దగ్గర నుంచి బయటకు వెళ్లాడని రైలు మొత్తం వెతికినా మాకు కనిపించలేదని అతని అక్క చెప్పినట్లు సమాచారం. శివరామకృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో అదే 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒక కిలోమీటరు పొడవున స్ట్రెక్చర్‌తో నడుచుకుంటూ స్థానికుల సహాయంతో తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయిన శివరామకృష్ణను ఆసుపత్రికి తీసుకువచ్చిన 108 పైలెట్ హరిబాబును, ఈఎంటీ కన్నబాబును వైద్యులు అభినందించారు.

రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు జిల్లా జట్టు ఎంపిక



రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు ఎంపికైన జిల్లా జట్టు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ జట్టును ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 120 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్ వజీర్ మాట్లాడుతూ రన్నింగ్, జంపింగ్, త్రోస్, వాక్ విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఉత్తమ ప్రతిభకనబరచిన వారిని ఎంపిక చేశామన్నారు. వచ్చే నెల 9, 10 తేదీల్లో విశాఖలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో ఎంపిక చేసిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. షేక్ నజీర్, కోటేశ్వరరావు, కందుల శ్రీనివాస్, జోజి, దాసు, కుమార్ పాల్గొన్నారు.

ఏపీ బీచ్ వాలీబాల్ జట్టు కోచ్‌గా నాగరాజు

రాష్ట్ర జట్టులో సభ్యుడిగా తెనాలి శివశంకర్



కోచ్ కె.నాగరాజు



ఎం.శివశంకర్

తెనాలి: గోవాలో జరుగుతున్న జాతీయ క్రీడాపోటీల్లో ఆంధ్రప్రదేశ్ బీచ్ వాలీబాల్ జట్టుకు స్థానం లభించింది. ఈ జట్టుకు కోచ్‌గా తెనాలిలోని అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడాస్టేడియం హ్యాండ్‌బాల్ కోచ్ ఎంపికవటం విశేషం. దేశంలోని వివిధ రాష్ట్రాల హ్యాండ్‌బాల్ జట్లలో ఎనిమిదింటికి మాత్రమే జాతీయ పోటీలకు అర్హత లభించగా, అందులో ఆంధ్రప్రదేశ్ జట్టు ఒకటని నాగరాజు చెప్పారు. గత నెల 25వ తేదీనుంచి ఆరంభమైన పోటీల్లో హ్యాండ్‌బాల్ పోటీలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ జట్టు తన తొలి మ్యాచ్‌ను సోమవారం ఆడనుంది. ఇదే జట్టులో తెనాలిలోని హ్యాండ్‌బాల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారుడు ఎం.శివశంకర్ కూడా ఉండటం మరో విశేషం. స్థానిక గుప్తా డిగ్రీ కాలేజీలో డిగ్రీ సెకండియర్ చదువుతున్న శివశంకర్, హ్యాండ్‌బాల్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నాడు. కోచ్ నాగరాజు, క్రీడాకారుడు శివశంకర్ ఇద్దరూ జట్టుతో పాటు ఇప్పుడు గోవాలో ఉన్నారు. తొలి మ్యాచ్‌కు సన్నద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

కొండవీడులో రెడ్డిరాజుల పాలన గ్యాలరీ ఏర్పాటు



గ్యాలరీలో బోర్డులను చూపుతున్న కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె శివారెడ్డి

యడ్లపాడు: కొండవీడు కోట చారిత్రక, సాంస్కృతిక విశేషాలు, నాటి రెడ్డిరాజుల పాలన వైభవాల్ని సందర్శకులకు తెలిపేందుకు కొండపై నూతనంగా గ్యాలరీ ఏర్పాటు చేశారు. కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె. శివారెడ్డి, హెరిటేజ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆవుల మురళీధరరెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ గ్యాలరీలో చారిత్రక అంశాల్ని తెలిపే ఛాయా చిత్రాలు, విశేషాల్ని తెలిపే 17 బోర్డుల్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శతాబ్దాల పాటు ఎందరో రాజులు, రారాజులు ఏలిన గడ్డ కొండవీడు కోటగా పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని శత్రు దుర్భేద్య రాజ్యంగా మలిచి వందేళ్ల పాటు తమ రెండవ రాజధానిగా చేసుకుని పాలించిన వారు అద్దంకి రెడ్డిరాజులన్నారు. 13 నుంచి 14 శతాబ్దం (క్రీ.శ.1325 –1424)లో కొండవీడులో వీరి పాలన కొనసాగిందని తెలిపారు. మొదట అద్దంకిని రాజధానిగా చేసుకుని రెడ్డిరాజులు పాలించినట్లు చెప్పారు. రాజ్యరక్షణలో భాగంగా ప్రోలయ వేమారెడ్డి కొండవీడుపై కోట నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, అతని కుమారుడైన అనపోతారెడ్డి రాజధాని నిర్మాణం పూర్తిచేసి 1353లో అద్దంకి నుంచి కొండవీడుకు మార్చినట్లు చెప్పారు. ఈ గ్యాలరీలో ప్రోలయ వేమారెడ్డి మొదలు రాచవేమారెడ్డి వరకు ఆరుగురు రాజులు కోస్తా ఆంధ్రా ప్రాంతాన్ని సుదీర్ఘంగా పాలించిన తీరు, రాజ్య విస్తరణ, కొండవీటి రాజ్యంలోని ప్రముఖులు కవిసార్వభౌముడు శ్రీనాథుడు, కవిత్రయంలో ఒకరైన ఎర్రాప్రగడ సాహిత్యానికి చేసిన సేవలు, ఉదయగిరి నుంచి ఒరిస్సా వరకు విస్తరించిన కొండవీడు రాజ్య పటం, రాజుల శాసనాలు, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖ ఆధ్వర్యంలో కొండవీడు–నగర వనం పేరిట చేస్తున్న అభివృద్ధి పనులు వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేశామని వివరించారు. కొండవీడును సందర్శకులకు ఆయా విశేషాలు తెలిపేందుకు ఈ గ్యాలరీని అటవీశాఖ అధికారుల అనుమతితో ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు.

గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌కు సత్కారం

సత్తెనపల్లి: గుంటూరు బార్ అసోసియేషన్‌కు ప్రతిష్టాత్మకంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయాన్ని సాధించిన కె.వి.కె.సురేష్‌ను పలు ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘ నాయకుడు జమిలి రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సురేష్ విజయం సాధించడం ఆర్యవైశ్యులకు గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. సభలో ఆర్యవైశ్య సంఘ నాయకులు చౌట శ్రీనివాసరావు, శింగరి మధుసూదనరావు, చలువాది చినసత్యనారయణ, ఆత్మకూరి హరేరామ చెంచయ్య మాట్లాడారు. ముందుగా పూలమాలలు, దుశ్శాలువాలతో సురేష్‌ను సత్కరించారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు మోటమర్రి చందు, జవ్వాజి రామమోహనరావు, పెరుమాళ్ల లక్ష్మీశివన్నారాయణ, మాడా నాగరమేష్, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.